# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | KAMAREDDY


## సీఎం సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన గ్రాడ్యుయేట్లు

**వెళ్లకుండా తలుపులు మూసిన నిర్వాహకులు**

కంఠేశ్వర్, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆత్మీయ సమ్మేళనంలో సీఎం సభ కోసం రెండు హాళ్లను ఏర్పాటు చేశారు. రెండో హాలులో పట్టభద్రులు పట్టుమని పది మంది కూడా కనిపించలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం కొనసాగుతుండగానే మధ్యలోనే పట్టభద్రులు లేచి వెళ్లిపోయారు. సభ నుంచి పట్టభద్రులు లేచి వెళ్లకుండా కొద్దిసేపు హాలు తలుపులు మూసివేయడం గమనార్హం.

## పోస్టల్ బ్యాలెట్ కోసం కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు

- నేడు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం
- కామారెడ్డిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కంఠేశ్వర్/కామారెడ్డి, ఫిబ్రవరి 24 : ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు కలెక్టరేట్‌లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పా టు చేసినట్లు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, ఆశీస్ సంగ్వాన్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉండి ఎలక్షన్ డ్యూటీ కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ సదుపాయాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవచ్చని సూచించారు. పోస్ట ల్ బ్యాలెట్‌కు ఒక్కరోజు మాత్ర మే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది డ్యూటీ ఆర్డర్ కాపీతో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకవచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన 235 మంది, ఇతర జిల్లాలకు చెందిన మరో 20 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.




కామారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



పట్టభద్రులు బయటికి వెళ్తుంటే.. తలుపులను మూసేసిన నిర్వాహకులు

సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

**ఫలితం లేని ముఖ్యమంత్రి ప్రచారం**

# కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్

- అవాకులు, చవాకులకే సీఎం టూర్ పరిమితం
- అరకొరగానే రుణమాఫీ, రైతుభరోసా అమలు
- లబ్ధి జరిగితేనే ఓట్లు వేయాలన్న సీఎం రేవంత్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల మంది బాధితులు
- గాంధీ కుటుంబాన్ని కించపర్చిన ఎంపీ అర్వింద్‌పై మౌనం
- పసుపు బోర్డు విషయంలో కేంద్ర వైఫల్యంపైనా నోరెత్తని వైనం
- గంటసేపు సుదీర్ఘ ప్రసంగంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌పై అక్కసు

*ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రి పర్యటన సెల్ఫ్‌గోల్‌ను తలపించింది. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన సభలో ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతం అవాకులు, చవాకులకే పరిమితమైంది. ఇచ్చిన హామీలపై కాకుండా ప్రతిపక్ష నాయకులపై విమర్శలకే పరిమితమయ్యారు. దీంతో సభకు హాజరైన పట్టభద్రులు అసహనం వ్యక్తంచేస్తూ మధ్యలో నుంచి వెళ్లిపోవడం గమనార్హం. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ఆయకట్టుకు సాగు నీరు, 24గంటల విద్యుత్ సరఫరా ఇవన్నీ అమలైతేనే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటెయ్యాలని, లేకపోతే మీకు నచ్చిన వ్యక్తికి ఓటెయ్యాలంటూ సీఎం చెప్పడంతో వేదికపై ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులందరూ ఒక్కసారిగా కంగుతిన్నారు.*

*–నిజామాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిత సమయానికి గంటన్నర ఆలస్యంగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి వచ్చారు. సమ్మేళనంలో దాదాపు గంట సేపు సుదీర్ఘంగా సాగిన ప్రసంగంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరునే పదే పదే జపించారు. ఆ తర్వాత కేటీఆర్, హరీశ్ రావు పేర్లను ఉచ్చరిస్తూ ప్రసంగం కొనసాగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు అసత్యాలను వల్లె వేశారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇంత వరకూ పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ జరగలేదు. సాంకేతిక కారణాలను బూచీగా చూపి 1.70లక్షల మందికి వ్యవసాయ శాఖ, బ్యాంకులు కొర్రీలు పెట్టాయి. దీంతో రుణమాఫీ కాక సామాన్య రైతులు ఇప్పటికీ కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదులు అందిస్తూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. రుణమాఫీ కాకపోతే ఓటెయ్యొద్దని సీఎం చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ ఇరుకున పడినట్లయ్యింది. మరోవైపు రైతు భరోసా పెట్టుబడి సాయం అరకొర మంది రైతులకు అందజేశారు. కేవలం మూడెకరాల్లోపు వ్యవసాయ భూములున్న వారికే ఎకరాకు రూ.6వేల చొప్పున జమ చేశామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, వాస్తవానికి అర్హులైన వారిలో సగానికి ఎక్కువ మందికి రైతుభరోసా అందలేదు. అందులోనూ కొత్తగా పాసుపుస్తకాలు పొందినవారిలో ఇంతవరకు ఏ ఒక్కరికీ సాయం జమకాలేదు. ఇంతటి ఘోరమైన వైఫల్యాన్ని మూటగట్టుకున్న ప్రభుత్వం.. రైతుభరోసా రాని వారంతా ఓటెయ్యొద్దని సీఎం చెప్పడంతో సంబంధిత వర్గాలు వేరే మార్గాలను చూసుకుంటున్నట్లుగా స్పష్టమవుతున్నది.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఊసే లేదు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు పథకం ఒక్కటి మాత్రమే అమలవుతున్నది.అది కూడా బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగి సరిపడా బస్సులు అందుబాటులో లేకుండా పోయాయి. ఉచిత బస్సుతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత బస్సుతో 150 కోట్ల మంది ప్రయాణించారని, మీకు మేలు జరిగితేనే ఓటెయ్యాలని మహిళలకు రేవంత్ పిలుపునిచ్చారు. కానీ మహిళా లోకం ఆయన మాటలు విని ఓటేసే పరిస్థితి కనిపించడం లేదు.

### అర్వింద్ వ్యాఖ్యలపై రేవంత్ మౌనం

కాంగ్రెస్ పార్టీని, ఇందిరా గాంధీ వారసత్వాన్ని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇటీవల తీ వ్రంగా తప్పుబట్టారు. వారి కులం, మతం పేరిట హేళన చేశారు. రాహుల్ గాంధీపైనా అవాకులు, చవాకులు పేల్చారు. అయితే జిల్లాకు వచ్చిన సీఎం స్థానిక బీజేపీ ఎంపీ తీరును ఎండగట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. అర్వింద్ వ్యాఖ్యలపై మౌనం పాటించిన సీఎం.. సోనియా కుటుంబాన్ని కించపర్చిన ఆయనను పల్లెత్తుమాట అనలేదు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై విమర్శలు చేసినప్పటికీ అర్వింద్ పేరును ఉచ్చరించకపోవడం గమనార్హం.

**ప్రత్యర్థి లోపాలను ఎత్తి చూపడంలో విఫలం**

జిల్లాలో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేశామంటూ కేంద్ర సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. వాస్తవానికి పసుపు బోర్డుకు ఇప్పటివరకూ అతీగతీ లేదు. కేంద్ర ప్రభుత్వ తీరును రేవంత్ రెడ్డి నిలదీయాల్సిన ఆవశ్యకత ఉన్నది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన పోటీదారుగా బీజేపీ అభ్యర్థి ఉన్నాడు. ప్రత్యర్థి పార్టీ లోపాలను ఎత్తి చూపడంలో సీఎం వైఫల్యం చెందినట్లుగా కనిపించింది. పసుపు బోర్డు తూతూ మంత్రంగా ఏర్పాటైనప్పటికీ మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పసుపు రైతులకు ధైర్యం కల్పించేలా ఒక్క మాట మాట్లాడలేదు. పట్టభద్రుల ఎన్నికల్లో పోటీలో లేని బీఆర్ఎస్ పార్టీపై నోటికొచ్చినట్లుగా మాట్లాడడం విడ్డూరంగా మారింది. గతంలో మాదిరిగానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుని తనదైన శైలిని మరోసారి బయటపెట్టుకున్నాడు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదంటూ కిషన్‌రెడ్డిని దద్దమ్మ అంటూ సంభోదించగా.. ప్రధాని తీరును మాత్రం ఎండగట్టలేకపోయాడు.

**నరేందర్ రెడ్డి డిమాండ్లను పట్టించుకోని సీఎం**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెళ్లారు. ఉస్మానియా వర్సిటీకి దీటుగా తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి, టీయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, లా కాలేజీ స్థాపన చేయాలని కోరారు. ఉర్దూ జూనియర్ కాలేజీని నూతన భవనంలోకి మార్చడం, ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల స్కాలర్‌షిప్ పెండింగ్ బిల్లులు, బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌ను మరింత ఉన్నతీకరించాలంటూ పలు డిమాండ్లను వివరించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఐటీ హబ్‌లో మరిన్ని కంపెనీలను ఏర్పాటు చేసే దిశగా కృషిచేయాలని కోరుతూ వేదికపై ఉన్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. పీసీసీ చీఫ్ హామీలకు, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి డిమాండ్లపై సీఎం ఎలాంటి స్పష్టతా ఇవ్వకపోవడం గమనార్హం. పేరుకు పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం అయినప్పటికీ ఆద్యంతం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రసంగంతో కార్యక్రమం ఉద్దేశం పక్కదారి పట్టింది.

**నిధులివ్వని రాష్ట్ర ప్రభుత్వం**

**భారంగా మారిన నిర్వహణ**
**బిల్లులు రాక కార్యదర్శులపై ఆర్థిక భారం**
**అప్పులు చేసి చేపడుతున్న పనులు**
**పాలకవర్గాలు లేకపోవడంతో**
**అందని కేంద్ర ఆర్థిక సంఘం నిధులు**

# పంచాయతీల్లో పైసల్లేవ్!

*ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగడంలేదు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతున్నది. పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. పైసాకూడా లేని దుస్థితిలో పంచాయతీలు ఉండడంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పంచాయతీల్లో రోజువారీ నిర్వహణ ఖర్చులకు తమ జేబు నుంచి ఖర్చుపెడుతున్నారు. ఏడు నెలలుగా నిర్వహణ ఖర్చుల భారాన్ని మోస్తున్నారు. తమ వేతనాలతోపాటు బయట నుంచి రూ.లక్షలు అప్పులు చేసి పంచాయతీల్లో ఖర్చుపెట్టక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోతున్నారు.*

*–బోధన్, ఫిబ్రవరి 24*

**పంచాయతీలు** ఎన్నడూ లేనివిధంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. దీంతో కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో అవసరాలనుబట్టి ఒక్కో కార్యదర్శి ఇప్పటివరకు రూ.50 వేలు మొదలుకుని రూ.లక్షన్నర వరకు చిన్న చిన్న పనులు, నిర్వహణకు ఖర్చుపెట్టారు. ఈ పరిస్థితి ఇంకెంత కాలం ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. గతేడాది ఫిబ్రవరి 2వ తేదీతో జీపీ పాలకవర్గాల కాలపరిమితి ముగిసింది. దీంతో గ్రామాలకు పెద్ద దిక్కుగా ఉన్న సర్పంచులు లేకుండాపోయారు. పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికాధిరులను నియమించింది. జిల్లాలో మొత్తం 532 గ్రామం పంచాయతీలు ఉండగా, రెండు, మూడు జీపీలకు ఒక్కో స్పెషలాఫీసర్‌ను నియమించారు. వీరు చేస్తున్న ఉద్యోగ బాధ్యతలతోపాటు ఒకటి కన్నా ఎక్కువ పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో పంచాయతీల కార్యకలాపాలపై పూర్థిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల బాధ్యతలను నిర్వర్తించాల్సిన బాధ్యత కార్యదర్శులపై పడింది. పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి ముగిసి ఏడాదవుతున్నప్పటికీ, ఇప్పటివరకు వాటికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పాలకవర్గాలు లేవన్న కారణంగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడంలేదు. మరోపక్క ఏడాది కాలంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల ఊసే లేదు. దీంతో పంచాయతీలు ఆర్థికంగా బలహీనపడ్డాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా నిర్వహణ కష్టంగా మారింది. మరోపక్క గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఎటువంటి ప్రయత్నాలూ జరగడం లేదు.




**గ్రామాల్లో వేధిస్తున్న తాగునీటి సమస్య**

వేసవి రావడంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల సంగతి సరేసరి. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా ఉంచే బాధ్యతలను ప్రభుత్వం కార్యదర్శులపైకి నెట్టింది. దీంతో వారు ఏడెనిమిది నెలలుగా తమ జేబుల నుంచే చిన్న చిన్న పనులు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ట్రాక్టర్ డీజిల్, మరమ్మతు పరికరాలు, బ్లీచింగ్, బయోటెక్స్, ఫాగింగ్, దోమల నివారణ మందులు, వీటితో పాటు వీధి దీపాల సామగ్రిని ఫర్మ్‌లు, షాపులు, వెండర్ల నుంచి తీసుకునేవారు. ఆ బిల్లుల చెల్లింపునకు గతంలో ఇచ్చిన చెక్కులు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అవి అవసరమైన సామగ్రిని సరఫరాను నిలిపివేశాయి. పైగా పాత బకాయిలు ఇవ్వాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నాయి. చేసేదిలేక సెక్రెటరీలు పంచాయతీల కోసం అప్పులు చేస్తున్నారు. తమ నెలసరీ వేతనాలు కూడా పంచాయతీల అవసరాలకే ఖర్చుచేస్తున్నామని చెబుతున్నారు. ఇంటి పన్నుల వసూళ్ల నుంచి తమ బిల్లులు వస్తాయనుకుంటే.. వాటిని ట్రెజరీల్లో జమచేయడం తప్ప చెక్కులు పాసవడంటేదని వాపోతున్నారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు ఇవ్వాలంటూ అధికారులతో మొరపెట్టుకుంటున్నారు.

**పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి..**



పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్య, వీధి దీపాల నిర్వహణ కోసం ప్రభుత్వం బిల్లులు పెండింగ్‌లో ఉంచడం శోచనీయం. దీంతో పంచాయతీల నిర్వహణ చాలా కష్టంగా ఉంది. ఏడెనిమిది నెలలుగా కార్యదర్శులు అప్పులు చేసి ఖర్చు చేస్తున్నారు. ఒకపక్క విధులను నిర్వర్తించడం, మరోపక్క ఆర్థిక భారం మోయాల్సి రావడంతో ఒత్తిడికి గురువుతున్నారు.

**-సురేశ్‌గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, తెలంగాణ పంచాయతీ సెక్రెటరీల అసోసియేషన్**

**ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు..**



జీపీల్లో నిధుల్లేక ఇబ్బందులు పడుతున్నం. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు రాలేదు. వసూలు చేసిన ఇంటి పన్ను లు ట్రెజరీలో జమచేయడం తప్ప పంచాయతీ బిల్లుల చెక్కులు పాసవడంలేదు. పంచాయతీల్లో నిర్వహణ భారం మోయలేకపోతున్నరు. ఇప్పటివరకు అప్పులు చేస్తూ ఖర్చుచేశాం. ఇకముందు చాలా కష్టం.

**-గణేశ్, కార్యదర్శి, సంగం పంచాయతీ, బోధన్ మండలం**

**రూ.లక్షా 30 వేల వరకు ఖర్చుచేశా..**



చిన్న చిన్న పనులకు కూడా బిల్లులు రావడంలేదు. గతంలోని బిల్లులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కార్యదర్శులందరూ సొంత జేబుల్లోంచి ఖర్చుచేస్తున్నారు. నేను ఇప్పటివరకు రూ.లక్షా 30 వేలు ఖర్చు చేశా.

**- పి.ప్రతాప్, కార్యదర్శి, కల్లూరు, కోటగిరి**

**'పసుపు' పనుల్లో పసి పిల్లలు**



**నిజామాబాద్** జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు పసుపు పంట పోటెత్తుతున్నది. పసుపు పంటను భారీగా తరలిస్తుండడంతో ఎక్కడ చూసినా పసుపు నిల్వలు పేరుకుపోతున్నాయి. పసుపు పంటను ఎండబెట్టడం, సంచుల్లో నింపడం, పసుపును జాలి పట్టడం, చినిగిన సంచులను కుట్టడం తదితర పనుల్లో పసి పిల్లలు దర్శనమిస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా పనిచేస్తుండడం 'నమస్తే కెమెరా'కు కనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడకు నిజామాబాద్ నుంచి పెద్దలకు బస్‌చార్జీ రూ.270, పిల్లలకు రూ.150, ఆర్మూర్ నుంచి పెద్దలకు రూ. 220, పిల్లలకు రూ. 120, కామారెడ్డి నుంచి పెద్దలకు రూ. 140, పిల్లలకు రూ. 80 ఉంటుందని తెలిపారు.

